## తాతా, నాన్నలే ఆదర్శంగా అభివృద్ధి

- ఎస్ఎల్బీసీ కాల్వను 9 కిలోమీటర్లు పొడిగిస్తా : జైవీర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : నాగార్జున సాగర్ ఎమ్మెల్యేగా ప్రజలు మెచ్చే పాలన చేస్తానని తన తాత, నాన్నలే ఆదర్శంగా అభివృద్ధిని కొనసాగిస్తానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తెలిపారు. తన గెలుపునకు సహకరించిన సాగర్ ప్రజలకు, అవకాశం ఇచ్చిన ఏఐసీసీ పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి జానారెడ్డి అడుగుజాడల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. తన హయాంలో ఎస్ఎల్బీసీ కాలువను మరో తొమ్మిది కిలోమీటర్లు పొడిగించే విధంగా కృషి చేస్తానని చెప్పారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి


నిడమనూరులో గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద బారులుదీరిన వినియోగదారులు

## గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ

- కేవైసీ అప్‌డేట్ చేయించుకునేందుకు బారులుదీరిన వినియోగదారులు

నిడమనూరు, డిసెంబర్ 9: ఆయిల్ కంపెనీల అదేశాల మేరకు గ్యాస్ ఏజెన్సీల వద్ద గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు పెద్దఎత్తున బారులు దీరి కేవైసీ అప్‌గ్రేడ్ చేయించుకుంటున్నారు. గ్యాస్ కనెక్షన్‌కు కేవైసీ చేయించేందుకు ఆధార్ కార్డు, గ్యాస్ బుక్, ఫోన్ నెంబర్ అప్‌డేట్ చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద జనం క్యూ కట్టారు. దీంతో ఎన్ని కనెక్షన్‌లు యాక్టివ్‌లో ఉన్నాయి అనే వివరాలు సేకరిస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ముందు వినియోగదారులలు బారులు దీరారు. పెద్ద అడిశర్లపల్లి, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, అనుముల, నిడమనూరు మండలాల పరిధిలోని సుమారు 20 వేల మంది గ్యాస్ వినియోగదారులున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. కాగా.. ఐదు మండలాలకు చెందిన వినియోగదారులు పెద్దఎత్తున గ్యాస్ కార్యాలయానికి పని వేళలకు ముందే తరలివచ్చి ఇలా బారులు దీరారు. ఈ అప్‌డేట్ ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 లకే గ్యాస్ కనెక్షన్ కోసమనే అపోహతో ఎగబడ్డారు.

## ఘనంగా గాయత్రి యజ్ఞం


సత్యసాయి ఆశ్రమంలో గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కొండమల్లేపల్లి, డిసెంబర్ 12: స్థానిక సత్యసాయి ఆశ్రమంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం గాయత్రి యజ్ఞంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా, విష్ణు సహస్రనామాలు తదితర పూజలు చేశారు. ఇక నుంచి ప్రతి నెల రెండో శనివారం ఆశ్రమంలో యజ్ఞం తదితర పూజలను నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సముద్రాల ధనయ్య, కాలం ప్రతాప్‌రెడ్డి, రాచమళ్ల నర్సింహ, చంద్రమౌళి, దాచేపల్లి వెంకటేశ్వర్లు, జగన్, మంచికంటి రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పని దినాలు పెంచాలి

- సీపీఐ మండల కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్

నూతనకల్, డిసెంబర్ 9 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని, కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తోట్ల ప్రభాకర్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎంఎంఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నట్లు తెలిపారు.

# హైవేపై అనుమతుల్లేకుండా తవ్వకాలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నందికొండ, డిసెంబర్ 9: హైవేపై ఎలాంటి అనుమతుల్లేకుండా కాంట్రాక్టర్లు తవ్వకాలు జరుపుతున్నారు. నందికొండ హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ సమీపంలో ఎన్‌హెచ్65 హైవే రోడ్డుపై పైపులైన్ కోసం కాంట్రాక్టర్ పనులను చేపడుతున్నారు. డ్యాం పైన ఉన్న గాడ్ రూమ్‌కు, పార్కుకు నీటి వసతికోసం ఎన్నెస్పీ అధికారులు తవ్వమని చెప్పారని కాంట్రాక్టర్ తెలిపారు. సంబంధిత ఎన్నెస్పీ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్లు చేపడుతున్న పనులపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. హైవేపై తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. హైవేపై ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టడంతో ఇక్కట్లు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.


లాంచీ స్టేషన్ సమీపంలో హైవేపై అనుమతుల్లేకుండా తవ్వకాలు

# జిల్లాలో మరో ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోపే ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉన్నది.

2021 మార్చి 29 నుంచి ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2015 ఎన్నికల్లో తొలిసారిగా ఇక్కడి నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారు. రెండోసారి కూడా బీఆర్ఎస్ నుంచి పల్లాకే అధినేత అవకాశం కల్పించారు. దీంతో 2021 మార్చి 14న జరిగిన పోలింగ్‌లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 2 సంవత్సరాల 9 నెలల పాటు శాసనమండలి సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించారు. ఈ నెల 3న వెలువడిన ఫలితాల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో అనివార్యంగా తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆదివారం తన రాజీనామా లేఖను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి అందజేయడంతో ఆయన రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రానున్న మూడు నాలుగు నెలల్లో మిగిలిన 3 సంవత్సరాల మూడు నెలల పదవీ కాలం కోసం ఉప ఎన్నిక జరుగనుంది. దీంతో నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల సందడి నెలకొననుంది.

# నమ్మించి.. నగదును దొంగలించారు

- రూ.2.25లక్షలతో పరారైన గుర్తు తెలియని వ్యక్తులు

నార్కట్‌పల్లి, డిసెంబర్ 9: బ్యాంకులో నగదును డ్రా చేసుకొని వెళుతున్న వ్యక్తిని నమ్మించి నగదును దొంగిలించిన సంఘటన పట్టణ కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చిన్నతుమ్మలగూడెం ఆవులోని బావికి చెందిన కన్నెబోయిన యాదయ్య శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంకులో తన ధాన్యం డబ్బులు రూ.2.25లక్షల డ్రా చేసుకొని ఒక కవర్‌లో పెట్టుకున్నాడు. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు అతని వద్దకు వెళ్లి అతని షర్టు, దోతిపై ఉమ్మివేసి ఎవరో నీ వెనుక ఉమ్మి వేశారని కడుకొమ్మని అతని దృష్టి మరల్చారు. అందులో ఒకరు నార్కట్‌పల్లి బేకరి షాపు వద్దకు వెళ్లగా అక్కడ అతనికి నీళ్లు ఇచ్చి కడుక్కోమన్నారు. అతను ఆ డబ్బుల కవర్‌ను ఒక కుర్చీ మీద పెట్టి కడుక్కునే సమయంలో మోసపూరితంగా రూ.2.25లక్షలు ఉన్న కవర్‌ను తీసుకొని పారిపోయారు. దీంతో కన్నెబోయిన యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గృహ కార్మికులకు ప్రభుత్వ పథకాల్లో అవకాశం కల్పించాలి

- గృహ కార్మికుల యూనియన్ జిల్లా కో ఆర్డినేటర్ అనసూర్య

బొడ్రాయిబజార్, డిసెంబర్ 9 : నివాస గృహాల్లో పనిచేసే గృహ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గృహ కార్మికుల యూనియన్ జిల్లా కో ఆర్డినేటర్ కాసా అనసూర్య అన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక నంబర్ 2 పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యూనియన్‌లో ఇప్పటి వరకు 800 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. అయితే వారికి ప్రభుత్వ పథకాల్లో ఎలాంటి అవకాశం లభించడం లేదన్నారు. గృహ కార్మికులకు డబుల్ బెడ్రూం ఇండ్లు, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్‌తో పాటు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. 8 గంటల పనికి రూ.12 వేలు వేతనం ఇవ్వాలని, వారంలో ఒక రోజు సెలవు కేటాయించాలని ఈ సందర్భంగా ఆమె యజమానులకు విజ్ఞప్తి చేశారు. గృహ కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు పాల్వాయి సుహాసిని, పద్మ, రేణుక, శారద, నాగమ్మ, వరలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గృహ కార్మికుల యూనియన్ జిల్లా కో ఆర్డినేటర్ అనసూర్య

## విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు అందించాలి

- విద్యార్థి సంఘం నాయకులు

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 9 : వివిధ కళాశాలలు, పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా బస్‌పాస్‌లను అందించాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు శనివారం డిపో మేనేజర్ సురేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పుల్లూరి సింహాద్రి, భరత్ మాట్లాడుతూ.. మహిళలకు ఉచితంగా బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లుగానే విద్యార్థులకు లింగ భేదం లేకుండా ఉచితంగా బస్‌పాస్‌లను అందించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రహీం, మహేశ్, నవీన్, గోపి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు